ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 02.10.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జాతిపిత మహాత్మా గాంధి జయంతి సందర్భంగా ప్రజలు ఈరోజు ఆయనకి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. హైదరాబాద్ బాపు ఘాట్ లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహాత్మగాంధికి ఘనంగా నివాళులర్పించారు.
2. స్వచ్చతను జీవితాల్లో ఒక భాగంగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
3. స్వచ్చతను కాపాడాలని గాంధిజీ స్వాతంత్ర్యోద్యమ సమయంలోనే పిలుపునిచ్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.
4. తెలంగాణ సాంస్కృతిక పండగ బతుకమ్మ ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.

----------

**గాంధీ జయంతి**

జాతి పిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రజలు ఈరోజు ఆయన స్మృతికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతికి ఆయన చేసిన సేవలను, సత్యం, అహింసా బోధనలను స్మరించుకున్నారు. హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపు ఘాట్ వద్ద రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరయ్యారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీకి నివాళులు అర్పిస్తూ,

సత్యం, ధర్మం సైన్యంగా స్వాతంత్ర్య పోరాటానికి గాంధీజీ దిక్సూచి అయ్యారని అన్నారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయనకు కూడా ఈ రోజు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. జై జవాన్ – జై కిసాన్ నినాదంతో లాల్ బహదూర్ శాస్త్రి జాతిని జాగృతం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు.

**<u>ప్రధానమంత్రి</u>**

స్వచ్ఛతను జీవితాల్లో అంతర్భాగం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. స్వచ్ఛత పట్ల నిబద్ధత ఒక్కసారి ఇచ్చే హామీ కాదని, జీవితకాల హామీ అని ఆయన ఈరోజు ఢిల్లీలో స్వచ్ఛతా హీ సేవ – 2024 కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. స్వచ్ఛ భారత్ ను సాధించేందుకు నిరంతర ప్రయత్నాలు అవసరమని స్పష్టం చేశారు. పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చిన 140 కోట్ల మంది భారతీయుల స్ఫూర్తికి ప్రధానమంత్రి జేజేలు పలికారు. ఈరోజు దేశ, విదేశాల్లో జరుగుతున్న స్వచ్ఛతా కార్యక్రమాల్లో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర ప్రతినిధులు పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. 10 వేల కోట్ల రూపాయల విలువైన స్వచ్ఛతా ప్రాజెక్టులు ఈరోజు ప్రారంభమవుతున్నాయని, ఇందులో 9 వేల 6 వందల కోట్ల రూపాయల వివిధ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇందులో అమృత్, అమృత్ 2.0, గంగా ప్రక్షాళన జాతీయ మిషన్, గోబర్ధన్ పథకం కింద 15 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ప్రాజెక్టులు ఉన్నాయి.

బైట్ ప్రధానమంత్రి

ఎన్.ఎస్.డి

**<u>నల్గొండ గాంధి</u>**

నల్గొండ జిల్లా చిట్యాల సమీపంలో హైదరాబాద్ విజాయవాడ జాతీయ రహదారిపై గాంధికి గుడి కట్టి పూజలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన మహాత్మాగాంధి

చారిట్రబుల్ ట్రస్ట్ 2014లో నిర్మించిన ఈ గుడి జిల్లా వాసులకే కాక రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక భావోద్వేగంగా మారింది. ఈ ఆలయంలో గాంధిజి కి నిత్య పూజలు చేయడంతో పాటు ఆలయ గోడల మీద మహాత్మ గాంధి సిద్ధాంతాలు తీర్చిదిద్దారు. ఆలయం కింది అంతస్థులో ఉన్న ధ్యాన మందిరంలో సందర్శులు ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు.

పిటిసి, నల్గొండ

**కిషన్ రెడ్డి**

గాంధి జయంతి సందర్భంగా సికింద్రాబాద్ మహాత్మగాంధి చౌక్ లో గాంధి విగ్రహానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా కలాసిగూడ పార్క్ లైన్ రోడ్డులో స్థానికులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్వచ్ఛ భారత్ అనేది ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఒక ప్రజా ఉద్యమమని అన్నారు. గాంధీజి కూడా స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో స్వచ్ఛతను కాపాడాలని, స్వాతంత్ర్యం ఎలాగైనా వస్తుందని పిలుపునిచ్చిన విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

పిటిసి, హైదరాబాద్

**గాంధీ- జిల్లాలు**

జిల్లాల్లో కూడా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఇతర అధికారులు, కాగజ్ నగర్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో సబ్

కలెక్టర్ శ్రద్ధ శుక్ల పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. కామారెడ్డి పట్టణంలో గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యుడు వెంకటరమణ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి కలెక్టర్ వల్లూరి క్రాంతి, సీఈఓ జానకి రెడ్డి తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వరంగల్ లో జిల్లా కలెక్ర్ సత్య శారద గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో ఇంచార్జ్ ప్రోగ్రామ్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి గాంధి చిత్రపటానికి పూలమాల వేసి గాంధిజి సేవలను గుర్తు చేశారు.

పిటిసిలు

**స్వచ్ఛత హీ సేవా**

కరీంనగర్ జిల్లా చొప్పదండి లోని పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం లొ జిల్లా గ్రామీణాభివృద్ధి గ్ శాఖ, స్వచ్ఛభారత్ గ్రామీణ శాఖ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చొప్పదండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ వేణుగోపాల్ రావు ముఖ్య అతిధిగా హాజరై జవహన్ నవోదయ విద్యాలయంలో సఫాయి కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వేణుగోపాల్ రావు మా ఆకాశవాణి ప్రతినిధి తో మాట్లాడుతూ, గడిచిన 16 రోజులుగా చొప్పదండి మండల వ్యాప్తంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

(PTC)

**యాదాద్రి - షెడ్యూల్ బైట్**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జిల్లా డి ఆర్ డి ఒ నాగిరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లోని 421 గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతాహి సేవ పనులు జరిగాయని ఆయన ఆకాశవాణి కి చెప్పారు.

BYTE

(PTC)

**బతుకమ్మ**

తెలంగాణ సాంస్కృతిక పండుగ బతుకమ్మ ఉత్సవాలు ఈరోజు ప్రారంభం అయ్యాయి. తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, ఆడుతారు. నేడు మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా జరుపుకుంటారు. సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఏకత్వ స్ఫూర్తిని చాటుకునేలా అక్టోబర్ 2 నుంచి 10 వరకు బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండుగ గా ప్రభుత్వం నిర్వహిస్తోంది. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ప్రతి రోజూ సాయంత్రం బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నారు. చివరి రోజైన ఈ నెల 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లేజర్ షో లాంటి పలు ఆకర్షణలు ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. అదే రోజు హైదరాబాద్ లోని అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు వెయ్యి బతుకమ్మలతో ర్యాలీ కూడా జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

(MSL)

**ఉదయ శంకర్**

తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ గా బి ఉదయ శంకర్ బాధ్యతలు చేపట్టారు. అభివృద్ధి బ్యాంకింగ్ రంగంలో ఆయనకు 31 ఎళ్ళ అనుభవం ఉంది. బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన ఉదయ భాస్కర్ 1993లో నాబార్డ్ లో చేరి, పలు రాష్ట్రాలలో వివిధ బాధ్యతలను నిర్వహించారు.

(MSL)

**మహాలయ**

మహాలయ అమావాస్యను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, పితృదేవతలకు పిండప్రదాన కర్మలు నిర్వహించారు. సనాతన భారతీయ సంస్కృతి లో మహాలయ అమావాస్య రోజున నదీ తీరప్రాంతాల్లో పితృకార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

(PTC)

**కాయకల్ప అవార్డు**

ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే కాయకల్ప అవార్డు వరుసగా మూడోసారి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆస్పత్రికి లభించింది. రాష్ట్రంలో సుమారు 100 ఏరియా ఆస్పత్రులు ఉండగా, మూడం చెల విధానంలో ఈ అవార్డు ను ఎంపిక చేశారు.మొదటి స్థానంలో నిలిచిన ఆస్పత్రికి ప్రభుత్వం నుంచి 15 లక్షల రూపాయల నగదు బహుమతి అందజేస్తారు. మూడోసారి అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, ఆర్ఎంవో సంతోష్ చారి ఆకాశవాణి కితెలిపారు.

(PTC)

**ప్రహ్లాద్ జోషి**

కామారెడ్డి జిల్లా కేంద్రం కామారెడ్డి పట్టణంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నిన్న సాయంత్రం స్వచ్ఛభారత్, బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్త బస్టాండ్ రోడ్లను శుభ్రం చేశారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా 20 కోట్ల పార్టీ సభ్యత్వం నమోదు చేయాలనేది బీజేపీ లక్ష్యమని, ఇప్పటి వరకు 7 కోట్ల సభ్యత్వం పూర్త యిందని తెలిపారు.

(PTC)

**పొంగులేటి- మంత్రి**

రాష్ట్రంలో పెరుగుతున్న ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు అందరూ సమిష్టిగా కృషి చెయ్యాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులకు సూచించారు. వరంగల్ జిల్లా మంత్రులు కొండ సురేఖ, సీతక్కలతో కలిసి జిల్లా శాసనసభ్యులతో. రాజకీయ అంశాలతో పాటు వరంగల్ జిల్లాలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై మంత్రి చర్చించారు.

(PTC)

**<u>హైడ్రా</u>**

విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ- హైడ్రాకి విస్తృతాధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీనితో ఇకపై హైడ్రా చేపట్టే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత ఉంటుంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్ కు చట్ట రూపం కల్పిస్తారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆటస్థలాలు సహా ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు, భారీ వర్షాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని క్రమబద్ధీకరించడం, అగ్నిమాపకశాఖ సేవలకు ఎన్ఓసీ జారీ తదితర లక్ష్యాలతో జులై 19న రాష్ట్రప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని హైడ్రా పరిధిలో చేర్చారు. హైడ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తుల పరిరరక్షణ విభాగం, విపత్తు నిర్వహణ విభాగాలు ఇప్పటికే పనిచేస్తుండగా, ఈ ఆర్డినెన్స్‌తో హైడ్రాకు మరిన్ని కీలక అధికారాలు లభించాయి.